# జోర్డాన్, ఈజిప్ట్ ట్రావెలాగ్

– మల్లాది వెంకట కృష్ణమూర్తి



## (ప్రారంభం)

**ఆగస్ట్** 2015 రెండో ఆదివారం హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం తొమ్మిది నించి సాయంత్రం ఆరున్నరదాకా హాలిడే బజార్ కార్యక్రమం జరుగుతుందని, దానికి హాజరవమని ఎస్.ఓ.టి.సి టూర్స్ వారినించి నాకు ఆగస్ట్ మొదటివారంలో ఇ-మెయిల్స్ ద్వారా, పోస్ట్ ద్వారా ఆహ్వానం అందింది. హాలిడే బజార్‌లో టూర్‌ని బుక్ చేసుకుంటే ఏ టూర్‌కైనా ఐదువేల రూపాయలు తగ్గిస్తామని, తప్పక రమ్మని ఫోన్ ద్వారా పదేపదే కోరారు. ఏటా అనేకసార్లు జరిగే వీటికి ఆహ్వానాలు వచ్చినా నేను ఎన్నడూ వెళ్ళేవాడిని కాదు. కానీ ఈసారి ఆహ్వానపు వత్తిడివల్ల నేను, పద్మజ ఎలాంటి ఆలోచనా లేకుండా అది ఎలా జరుగుతుందో చూద్దామని వెళ్ళాం.

హోటల్ తాజ్ కృష్ణా కాంపౌండ్‌లో మెయిన్ బిల్డింగ్‌కి బయట, అవుట్ గేట్ దగ్గర గల ఇలాంటి కార్యక్రమాలు జరిగే విశాలమైన హాల్‌లోకి వెళ్ళాం. ఎస్.ఓ.టి.సి సిబ్బందిలోని ఒకతను మమ్మల్ని గుర్తుపట్టి, తీసుకెళ్ళి అక్కడ అనేక బల్లలు, కుర్చీల్లో ఓ దానిముందు మమ్మల్ని కూర్చోపెట్టాడు. ఎస్.ఓ.టి.సి సిబ్బందిలోని శేఖర్ చౌదరి అనే అతను తనని పరిచయం చేసుకుని అడిగాడు.

"హాలిడేకి ఎక్కడికి వెళ్తారు?"

ఎదురుగా గోడమీద ఈజిప్ట్ పోస్టర్ కనిపించింది. పద్మజ చాలాకాలంగా ఈజిప్ట్ చూడాలని అనుకుంటోంది. కానీ అది మరో ఇండియాలాంటిది కాబట్టి నేను వాయిదా వేస్తూ వస్తున్నాను. ఇండియా కంటే మంచి దేశాలని చూడాలనేది నా ఉద్దేశం. ఈజిప్ట్‌లోని రాజకీయ అస్థిరత్వం వల్ల గత నాలుగైదు ఏళ్ళుగా టూర్లు రద్దయ్యాయి. ఇటీవలే మళ్ళీ ఆరంభమయ్యాయి.

"ఇప్పుడు ఈజిప్ట్‌కి టూర్స్ నడుపుతున్నారా?" అడిగాను.

"అవును"

"ప్రమాదం ఏమీలేదుగా? అక్కడి పరిస్థితులు చక్కబడ్డాయా?" అడిగాను.

ప్రమాదం లేదని తెలిసాక దానికి సంబంధించిన బ్రోషర్‌ని తిరగేస్తే ఈజిప్ట్‌తో పాటు జోర్డాన్‌ని కూడా టూర్‌లో కలుపుకోవచ్చని తెలిసింది. టూర్లు ఆరంభమయ్యే తేదీలలోంచి 17 అక్టోబర్ 2015ని ఎన్నుకుని అడిగాను.

"ఈ టూర్ రద్దవుతుందా? లేక తప్పనిసరిగా ఉంటుందా? ఇప్పుడే చెప్పగలరా?"

ఉంటుందని శేఖర్ హామీ ఇచ్చాక మా ఇద్దరికీ ఆ టూర్‌కి చెరో ఐదువేల రూపాయలు ఇచ్చి బుక్ చేసాను.

హాలిడే బజార్‌లో యు.ఎస్ డాలర్ విలువ డాలర్‌కి 64రూపాయలుగా చూపించారు. కానీ ఆ రోజుకి అది 66 రూపాయలు ఉంది. డాలర్‌కి రెండు రూపాయల చొప్పున ఆ మేళాలో తగ్గించి చూపిస్తే, టూర్ ఖర్చు తక్కువగా చూపించినట్లు అవుతుంది. చివరికి పర్యాటకులనించి ఆ మేరకి ఎక్కువ వసూలు చేయడం వల్ల చెప్పిన మొత్తం కన్నా ఎక్కువ తీసుకున్నారనే భావన కలుగుతుందని, ఇది సరికాదని, వాస్తవాలని దాచద్దని మేనేజ్‌మెంట్‌కి సూచించమని, శేఖర్‌కి ఫోన్‌లో చెప్పాను. మెయిల్ ఇచ్చాను. డాలర్ రేటు ఎటూ తగ్గదు కాబట్టి ఇది ఓ విధంగా పర్యాటకులని మోసం చేయడమే అనికూడా చెప్పాను. దానికి సమాధానం రాలేదు.

వారం తర్వాత శేఖర్ ఫోన్ చేసి చెరో పదివేలరూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించమని కోరాడు.

మా పాస్‌పోర్ట్స్‌లో రెండు పేజీలే ఖాళీగా ఉండడంతో అది సరిపోతుందా లేక కొత్త పాస్‌పోర్టులు తీసుకోవాలా చెప్పమని జవాబు ఇచ్చాను. వాళ్ళ మనిషి వచ్చి పాస్‌పోర్ట్‌ని తీసుకెళ్ళాడు. వాటిని పరిశీలించాక కొత్త పాస్‌పోర్ట్‌ని తప్పనిసరిగా తీసుకోవాలని శేఖర్ చెప్పాడు. పాస్‌పోర్ట్ రెన్యువల్ అయ్యాక నేనే కాంటాక్ట్ చేస్తా అని, వాటిని తిప్పి పంపమని, మళ్ళీ ఫోన్ చేయద్దని శేఖర్‌కి ఇ-మెయిల్ ఇచ్చాను.

పూర్వం 1997లో సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ ఆఫీస్‌లో పాస్‌పోర్ట్ రెన్యువల్‌కి చాలా అవస్థపడ్డాను. చాలా పెద్ద క్యూ ఉండేది. విభజన జరగని ఆంధ్రప్రదేశ్ మొత్తానికి అదొక్కటే ఆఫీస్ పని చేసేది. పాస్‌పోర్ట్ ప్రతీ పౌరుడి హక్కైనా, బాగా రద్దీగా ఉండటంతో లోపలికి వెళ్ళకుండా పోలీసులు గేటు దగ్గర అడ్డుకునేవాళ్ళు. అడిగితే సమాధానం చెప్పే బాధ్యతగల ఉద్యోగులు ఎవరూ అక్కడ అందుబాటులో ఉండేవారు కాదు. పైగా వారిమీద పని వత్తిడి అధికంగా ఉండేది. మధ్యవర్తుల ద్వారానే పాస్‌పోర్ట్ తేలిగ్గా వచ్చేది. పాస్‌పోర్ట్ ఆఫీస్‌లోని లంచగొండితనం మీద, ఈ దళారుల మీద పత్రికల్లో చాలా వార్తలు వచ్చేవి. సమయానికి పాస్‌పోర్ట్ అందక ఎందరో, ఎన్నో విషయాల్లో నష్టపోయేవారు. పాస్‌పోర్ట్‌కి వెబ్‌సైట్ తెరిచి దానిద్వారా అపాయింట్‌మెంట్‌ని బుక్ చేసుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఐతే పబ్లిక్ బుక్ చేసుకోకుండా సైట్ తెరిచీ తెరవగానే మధ్యవర్తులే స్లాట్స్‌ని బుక్ చేసుకుని బ్లాక్ చేసేసేవారు.

అది గుర్తొచ్చి ఓ మిత్రుడ్ని తన పాస్‌పోర్ట్‌ని ఎలా రెన్యూ చేసుకున్నాడని నేను అడిగితే ధర్మేందర్ సింగ్ అనే అతని ఫోన్ నంబర్ని ఇచ్చాడు. ఫోన్ చేస్తే అతను మా ఇంటికి వచ్చాడు. తత్కాల్‌కైతే మూడువేలని, సాధారణ పాస్‌పోర్టుకి రెండువేలని, తత్కాల్ ఇరవైనాలుగ్గంటల్లో, సాధారణ పాస్‌పోర్ట్ మూడురోజుల్లో వస్తుందని ధర్మేంద్ర చెప్పాడు. మాకు తత్కాల్ అవసరంలేదని చెప్పడంతో మాములుగా బుక్ చేసాం. జంబో పాస్‌పోర్ట్‌కి, రెన్యువల్ ఫీజ్‌కి, అఫిడవిట్‌కి నాలుగువేలు, తన ఫీజ్ తలో వెయ్యి కలిపి, తలకి మూడువేల చొప్పున మా ఇద్దరి పాస్‌పోర్ట్స్ రెన్యువల్‌కి మొత్తం ఆరువేలు తీసుకున్నాడు. 60 పేజీలు ఉండే పాస్‌పోర్ట్‌ని జంబో పాస్‌పోర్ట్ అంటారు. అంతకు మునుపు మేము 30 పేజీల సాధారణ పాస్‌పోర్ట్‌నే తీసుకున్నాం. సికింద్రాబాద్, బేగంపేటల్లో రెండు కార్యాలయాల్లో మేము దేనికైనా వెళ్ళచ్చని, దేనికి బుక్ చేయాలని అతను అడిగాడు. సికింద్రాబాద్‌లోని చేదు అనుభవంతో బేగంపేటలోని కార్యాలయంలో బుక్ చేయమని కోరాను.

మేము డిసెంబర్ 2014లో పాత ఇంటినించి మా ఇంటి పక్కన పాత ఇంటిని పగలకొట్టి కట్టిన ఓ కొత్త అపార్ట్‌మెంట్‌కి మారడంతో, చిరునామా మార్పుకి సంబంధించిన ఏ పత్రాలు దాఖలు చేయాలి మొదలైనవి అతను గైడ్ చేసాడు. సెప్టెంబర్ 3వ తారీకున మధ్యాహ్నం 3కి మాకు బేగంపేట పాస్‌పోర్ట్ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకుని ధర్మేంద్ర సింగ్ అపాయింట్ మెంట్ లెటర్ ప్రింట్ అవుట్స్‌ని మర్నాడు తెచ్చిచ్చాడు. నా పాత అనుభవం విని, ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది ఉండదని అతను హామీ ఇచ్చినా నేను నమ్మలేదు. కానీ అతని మాటలే నిజం అని తర్వాత తెలిసింది.

ఇప్పుడు వైజాగ్, విజయవాడ, తిరుపతిల్లో కూడా పాస్‌పోర్ట్ కేంద్రాలు తెరవడమే కాక, జంటనగరాల్లో మరి కొన్ని కార్యాలయాలని కూడా తెరిచారని దినపత్రికల్లో చదివాను. బేగం పేటలో యు.ఎస్ కన్సులేట్ దగ్గరే ఇది ఉంది. పాస్‌పోర్ట్ సర్వీస్‌ని ప్రైవేట్ సంస్థకి అవుట్ సోర్స్ చేసారని నాకు అక్కడికి వెళ్ళాకే తెలిసింది. గతంలో నేను చూసిన చెత్త ప్రభుత్వ కార్యాలయంలా కాక కార్పొరేట్ ఆఫీస్ పద్ధతిలో పూర్తి ఏర్‌కండిషన్‌తో, బాధ్యతగల ఉద్యోగస్థులతో ఆ కార్యాలయం పనిచేయడం గమనించాను. సందర్శకుల సౌకర్యార్థం జెరాక్స్ మెషీన్, చిన్న కేంటిన్ సదుపాయాలు కూడా ఆ కార్యాలయంలో ఉన్నాయి.

పని అంత తేలిగ్గా అవుతుందని నేను ఊహించలేదు. అపాయింట్‌మెంట్‌కి పావుగంట ముందు క్యూలో ఉన్న మా పాస్‌పోర్ట్, అపాయింట్‌మెంట్ లెటర్ చూసి గార్డ్ మమ్మల్ని లోపలికి అనుమతించాడు. లోపల కౌంటర్‌లోని ఓ వ్యక్తి పాత పాస్‌పోర్ట్‌లని పరిశీలించి వెనక్కి ఇచ్చి, సబ్మిట్ చేయాల్సిన కాగితాలన్నిటినీ తీసుకుని, మా ఇద్దరికీ స్లాట్ నంబర్స్ ప్రింట్ చేసిన చిన్న కాగితాలని ఇచ్చాడు. సీనియర్

సిటిజన్ని కాబట్టి నాకు త్వరగా పని అయే స్లాట్ని ఇచ్చారు. సాధారణ స్లాట్ ఇచ్చిన పద్మజకి గంటదాకా లేటైంది. అతని పక్క కౌంటర్లోని వ్యక్తి మా పేర్లు పిలిచి, మా కాగితాలని ఉంచిన బ్రౌన్ కలర్ ఫోల్డర్స్ని ఎవరిది వారికి ఇచ్చాడు.

వాటిని తలుపు దగ్గర గార్డ్కి చూపించి లోపలికి వెళ్ళాం. లోపల ఏ,బి,సి విభాగాలు ఉన్నాయి. ఒకదాని తర్వాత ఇంకో దానికి వెళ్ళాలి. ప్రతీ విభాగంలో విండోస్లో ఏ స్లాట్ నంబర్ వారు ఏ కౌంటర్కి వెళ్ళాలో డిస్ప్లే మానిటర్ సూచిస్తుంది కాబట్టి ఎవర్నీ అడగాల్సిన పనిలేదు.

అక్కడి మానిటర్లలోని ప్రకటనలు ప్రయాణీకులకి ఉపయోగించే కంపెనీలకి చెందినవే అని గ్రహించాను. ఇల్లు వదిలి వెళ్ళినప్పుడు రక్షణకి గాడ్రేజ్ లాకర్ ప్రకటన. ట్రావెల్ ఏర్పాట్లకి థామస్ కుక్ ట్రావెల్ ఏజెన్సీ ప్రకటన. బేంక్ ఆఫ్ బరోడా అంతర్జాతీయ డెబిట్ కార్డుల ప్రకటన. ట్రావెల్ ఇన్సూరెన్స్ అచోశా ఎం.ఎస్ కంపెనీ ప్రకటన. ఇలా.

ముందు ఏ కౌంటర్కి వెళితే కెమేరాతో మా ఫోటోలు తీసుకున్నారు. బి కౌంటర్లో డాక్యుమెంట్స్ చెక్ చేసారు. ఏ,బి కౌంటర్లోని పనిచేసే వాళ్ళు ప్రైవేటు ఉద్యోగస్థులు. సి కౌంటర్లో మాత్రమే కేంద్రప్రభుత్వ పాస్పోర్టు ఉద్యోగులు ఉన్నారు. వారు మా కాగితాలన్నీ తణిఖీ చేసి, మా వేలిముద్రలు తీసుకుని రసీదు ఇచ్చారు. ఆ రసీదుని ఆ ఆఫీస్లోంచి బయటకి వెళ్ళే గేట్ పక్కన కేబిన్లో చూపిస్తే ఫైనల్ రసీదు ఇచ్చారు. ఒకో విభాగంలో చాలా కౌంటర్స్ ఉండటంతో వేచి ఉండాల్సిన సమయం తగ్గిపోయింది.

మూడోరోజు రిజిస్టర్ పోస్ట్లో మా పాస్పోర్ట్స్ అందాయి. వెంటనే ఎస్.ఓ.టి.సి శేఖర్కి ఫోన్ చేసి చెప్పాను.

"17 అక్టోబర్ టూర్కి బుక్ చేసేట్లైతే అడ్వాన్స్ ఇస్తాను."

కారణం కనీస సంఖ్యలో పర్యాటకులు లేకపోతే వారా టూర్ని రద్దు చేసేస్తారు. ఆ టూర్ ఉంటుందని మరోసారి హామీ ఇచ్చాక, ఇరవైవేలకి చెక్ని పంపాను. ఆ తర్వాత వారానికి ఓసారి ఫోన్ చేసి టూర్ బుక్ చేయడానికి మరో పాతికవేలు అడ్వాన్స్గా ఇవ్వమని శేఖర్ అడగసాగాడు. అక్టోబర్ 17కి టూర్ కన్ఫం చేస్తూ ఉత్తరం పంపితే అడ్వాన్స్ ఇస్తానని చెప్పాను. ఈసారి శేఖర్ రాతపూర్వకంగా హామీ ఇవ్వడానికి అంగీకరించలేదు నేను కోరిన ఉత్తరం పంపే పక్షంలోనే నాకు మళ్ళీ ఫోన్ చేయమని, లేదా వద్దని శేఖర్తో గట్టిగా చెప్పాను. ఆ తర్వాత అతన్నించి ఫోన్ రాలేదు.

అతని మాట - తీరులో మర్యాద, మన్నన లేవు. పూర్వం మా జపాన్ టూర్ని హేండిల్ చేసిన జీనీ బాధ్యతగా వ్యవహరించేది.

మా టూర్ సంగతి ఆమె చూడాలని కోరితే, మా అడ్వాన్స్ సికింద్రాబాద్ బ్రాంచ్కి చేరిందని, ఆమె హెడ్డాఫీస్లో పని చేస్తుందని, కాబట్టి తనే టూర్కి బాధ్యుడని శేఖర్ చెప్పాడు. జీనీకి నా టూర్ని టేకప్ చేయమని, శేఖర్తో వ్యవహారం సరిగ్గా లేదని ఇ-మెయిల్ ఇచ్చాను. తను టేకప్ చేయలేనని ఆమె సమాధానం ఇచ్చింది.

ఆ తర్వాత నేను ఇ-మెయిల్ ఇస్తే శేఖర్ జవాబు ఇవ్వకపోవడం, ఫోన్ చేస్తే సీట్లో లేక, మళ్ళీ కాల్ బేక్ చేయకపోవడంతో ఇక ఆ టూర్ సంగతి మర్చిపోయాను.

సెప్టెంబర్ 24న శేఖర్ నించి అక్టోబర్ 17న ఈజిప్ట్, జోర్డాన్ టూర్ కన్ఫర్మైందని, బేలన్స్ అమౌంట్ పంపమని ఇ-మెయిల్ వచ్చింది.

వెంటనే పాత, కొత్త పాస్పోర్ట్స్, బేలన్స్కి చెక్, వీసాకోసం మా ఇద్దరి ఫోటోలని అతను పంపిన మెసెంజర్ అర్జున్ ద్వారా పంపించాను. మా మూడేళ్ళ ఇన్కంటాక్స్ రిటర్న్స్ని ఇ-మెయిల్ చేసాను. అతను జోర్డాన్కి, ఈజిప్ట్కి వీసా అప్లికేషన్ ఫామ్స్ని పంపనేలేదు. అవసరమైనప్పుడు అడుగుతారని ఊరుకున్నాను.

ఫైనల్ పేమెంట్ చెక్ అందాక 26 సెప్టెంబర్ 2015న శేఖర్ మా ఫ్లైట్ వివరాలకి చెందిన షెడ్యూల్ని, పాస్పోర్ట్లని, పర్యాటకుల జాబితాని ఇంటికి మెసెంజర్ ద్వారా పంపించాడు. పాస్పోర్ట్లలో చూస్తే లోపల వీసా ముద్రలు లేవు. వెంటనే ఫోన్ చేసి

అడిగితే, జోర్డాన్, ఈజిప్ట్‌లకి జాబితాలోని మా బృందం పర్యాటకులు అందరికీ వీసాలు మంజూరయ్యాయని 'ఆన్ అరైవల్' ఇస్తారని శేఖర్ చెప్పాడు. నిజానికి ఇది అడక్కుండా, బాధ్యతగా చెప్పాల్సిన సమాచారం.

మా ప్రయాణం అక్టోబర్ 17న బాంబే నించి ఆరంభమౌతుంది. ఆ ఉదయం 6.25కి మేము బాంబేలో కువైట్ ఏర్‌లైన్స్ విమానం ఎక్కాలి. అందువల్ల హైదరాబాద్ నించి బాంబేకి ఆ5 రాత్రి ఆఖరుగా బయలుదేరే విమానం ఏదో 'మేక్ మై ట్రిప్' సైట్‌లోకి వెళ్ళి పద్మజ చూసింది. అది ఎయిర్ ఇండియా విమానం. ఎయిర్ ఇండియా సైట్‌లోకి వెళ్ళి చూస్తే 'మేక్ మై ట్రిప్' సైట్‌లోకన్నా టిక్కెట్ ధర పదిహేను వందలు తక్కువ చూపించింది. ఆ సైట్లోంచి మా ఇద్దరికీ రానూపోనూ టిక్కెట్లు బుక్ చేసాం. ఇద్దరికీ కలిపి రూ.10,954/- అయింది.

అక్టోబర్ 15న ఎస్.ఓ.టి.సి మనిషి అర్జున్ మా ఇంటికి వచ్చి బ్రీఫింగ్ షీట్, చిన్న స్ట్రోలర్, టోపీలు, ట్రావెల్ పౌచ్‌లు ఇచ్చి వెళ్ళాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*